క్లుప్తంగా

రూ.5.50 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామం 7వ వార్డు కుమ్మరి బజారునందు డ్రెయినేజీ కాలువల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో రోడ్డు కమ్ డ్రెయినేజీ నిర్మాణం పనులు చేస్తున్నట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. కుమ్మరి బజార్లో మినీ వాటర్ ట్యాంక్ నుంచి 66 మీటర్ల పొడవుతో సిమెంటు రోడ్డు, ఆ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మిస్తున్నట్టు ఆయన వివరించారు. ఎంతో కాలంగా రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న ప్రజానీకం జరుగుతున్న పనుల పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

ఉయ్యూరు: జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎగినపాడు, నాగన్నగూడెం గ్రామాల్లో జగనన్న లే అవుట్‌లలో గృహ నిర్మాణాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకునేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల నుంచి రూ. 45 వేలు రుణం మంజూరు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పంట బోదెలోకి టిప్పర్ బోల్తా



కంకిపాడు: పంట బోదెలోకి టిప్పరు బోల్తా పడ్డ సంఘటన సోమవారం తెల్లవారుజామున ఈడుపుగల్లు గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. రబ్బిష్ లోడుతో ఉప్పలూరు వైపు నుంచి ఈడుపుగల్లు గ్రామంలోకి వస్తున్న హెవీ లోడ్ టిప్పరు ఈడుపుగల్లు గ్రామంలోని ప్రధాన మలుపు వద్దకు రాగానే అదుపుతప్పి పక్కనే ఉన్న పంట బోదెలోకి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. బోల్తా పడ్డ టిప్పర్‌ను రెండు క్రేన్ సహాయంతో బోదెలో నుంచి బయటకు తీశారు. ఈ సమయంలో ఈడుపుగల్లు–ఉప్పలూరు రోడ్డు మార్గంలో రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. ఘటనపై పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యమయ్యాడని భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం పెనమలూరు అంబేడ్కర్‌నగర్‌లో చింతపల్లి నరేష్, భార్య గ్లోరతేజ నివసిస్తున్నారు. భర్త ఆటోనగర్‌లో వీఆర్ఎల్ ట్రాన్స్‌పోర్టులో పని చేస్తాడు. భార్య పెనమలూరు 2 సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తోంది. అయితే భర్త దురలవాట్లకు బానిసగా మారటంతో భార్యభర్తల మధ్య ఈ నెల 12వ తేదీన గొడవ జరిగింది. దీంతో భర్త ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. నరేష్ కోసం గాలించినా అతని ఆచూకీ తెలియక పోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు శుభవార్త



హనుమాన్‌జంక్షన్ రూరల్: సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు త్వరలోనే యూపీఐ వంటి డిజిటల్ లావాదేవీలు నిర్వహించే వెసులుపాటు అందుబాటులోకి రానున్నట్లు ఆ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖ నూతన ప్రాంగణాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. 1986లో ప్రారంభించిన వీరవల్లి శాఖ ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించటంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని చెప్పారు. జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల తరహాలోనే సప్తగిరి గ్రామీణ బ్యాంకు కూడా రాబోయే మూడు నెలల్లో యూపీఐ, డిజిటల్ సేవలను ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, విద్యా, డ్వాక్రా రుణాలను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. రీజనల్ మేనేజర్ ఎన్.బ్రహ్మయ్య, బ్రాంచ్ మేనేజర్ వై.మాధవి పాల్గొన్నారు.

ప్రగతి పథంలో గంగూరు

- అభివృద్ధిలో దూసుకుపోతున్న గ్రామం
- రూ.6.91 కోట్లతో అభివృద్ధి పనులు
- మరిన్ని పనులకు ప్రణాళిక



గంగూరులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలు

పెనమలూరు: మండలంలో పారిశ్రామిక వాడగా పేరున్న గంగూరు గ్రామం ప్రగతి పథంలో పయనిస్తోంది. గత పాలకుల సమయంలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని గంగూరు గ్రామం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. గ్రామంలో ఇప్పటివరకు రూ.6.91 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశారు. భవిష్యత్తులో మరిన్ని పనులు చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

గ్రామం పరిస్థితి ఇదీ..

విజయవాడ నగర శివారులో ఉన్న గంగూరు గ్రామంలో దాదాపు ఆరువేల జనాభా ఉంటారు. ఇక్కడ అనేక పరిశ్రమలు ఉన్నాయి. పాత గంగూరుతో పాటు రెండు దళితవాడలు, కాలువ కట్టలపై పేదలు నివసిస్తున్నారు. గంగూరు గ్రామ పంచాయతీకి ఆదాయవనరులు పరిమితంగా ఉండటంతో అభివృద్ధి ఇంతకాలం జరగలేదు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో గ్రామంలో ఇప్పుడు అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో గ్రామంలో రియల్ ఎస్టేట్ రంగం జోరుగా ఉంది.

గ్రామంలో జరిగిన పనులు ఇవే..

గ్రామంలో కొద్ది కాలంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. రూ.99.50 లక్షలతో రెండు గ్రామ సచివాలయాలు పూర్తి సౌకర్యాలతో నిర్మించారు. రైతుభరోసా కేంద్రం భవనం రూ.28.50 లక్షలతో, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం రూ.29.50 లక్షలు, రూ.కోటితో ఇంజినీరింగ్ కాలేజీ–ఈడుపుగల్లు రోడ్డు నిర్మించారు. రూ.20 లక్షలతో చెరువు కట్ట సీసీ రోడ్డు, రూ.9 లక్షలతో ముస్లిం బరియల్‌గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.27 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు.

జరుగుతున్న పనులు..

గ్రామంలో పేద ముస్లిం అవసరాలకు రూ.50 లక్షలతో షాదీఖానా నిర్మాణం చేస్తున్నారు. పేదలు అధిక సంఖ్యలో నివసిస్తున్న ఈఎస్ఐ కాలువ కట్టపై సీసీ రోడ్డు రూ.29 లక్షలతో, కరెంట్ ఆఫీసు వెనుక కాలువ కట్ట పై రూ.32 లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తికానున్నాయి.



గంగూరులో గవర్నర్ సందర్శించనున్న రైతుభరోసా కేంద్రం



గంగూరులో అభివృద్ధి చేసిన కబరస్తాన్

పంచకులాల శ్మశానవాటిక అభివృద్ధికి రూ.18 లక్షలు, ప్రభుత్వ సముదాయాల వద్ద కాంపౌండ్ వాల్‌కు రూ.10 లక్షలు, గ్రామ సచివాలయం ఎదుట సీసీ రోడ్డు రూ.7 లక్షలతో నిర్మించనున్నారు.

రూ.2.12 కోట్లతో వాటర్ ట్యాంకులు..

గంగూరు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామంలో రూ.2.12 కోట్లతో ఐదు వాటర్ ట్యాంకులు నిర్మాణం చేయనున్నారు. గ్రామంలో తాగునీరు సమస్య లేకుండా ఉచిత కుళాయి కనెక్షన్‌లు ఇస్తారు. రూ 2.12 కోట్లతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఐదు వాటర్ ట్యాంకులు నిర్మించి పైప్‌లైన్‌లు వేస్తారు. ఈ మేరకు నిధులు విడుదల అయ్యాయి.

ఆర్‌బీకేను సందర్శించనున్న గవర్నర్..

గ్రామంలో రైతుభరోసా కేంద్రంతో రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందారు. రైతులకు సేవలు అందించంలో గంగూరు రైతుభరోసా కేంద్రం ఆదర్శంగా నిలిచింది. దీంతో గవర్నర్ అబ్దుల్‌నజీర్ 26వ తేదీ గంగూరుకు వచ్చి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు.

అభివృద్ధిలో రాజీలేదు



గ్రామాభివృద్ధికి రాజీలేకుండా కృషి చేస్తున్నాం. ఎమ్మెల్యే పార్థసారథి సహకారంతో పుష్కలంగా నిధులు మంజూరు అవుతున్నాయి. గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నేతలు, పంచాయతీ పాలక వర్గం సహకారం ఉంది. గ్రామంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నాం. రానున్న రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం.

– తస్లీమున్నీసా, సర్పంచ్ గంగూరు గ్రామ పంచాయతీ

పాలనలో విప్లవాత్మక మార్పులు..



ముదునూరులో ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు



సూరంపల్లిలో మాట్లాడుతున్న గౌసాని



మానికొండలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ కుసుమ, అధికారులు

ఉయ్యూరు: జగనన్న సురక్షతో పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎంపీడీఓ విమాదేవి అన్నారు. మండలంలోని ముదునూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో 1406 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీడీఓ విమాదేవి మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రజలకు గొప్ప వరంలా మారిందన్నారు. 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సచివాలయాల్లోనే పొందుతున్నారన్నారు. ప్రజలందరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ మస్తాన్, సర్పంచ్ మొవ్వ వెంకట నాగలక్ష్మి, ఎంపీటీసీ గంజి స్వర్ణకుమారి, ఏఎంసీ వైస్‌చైర్మన్ దాసే రవి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

గన్నవరం రూరల్: ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని అన్నారు. సోమవారం మండలంలోని సూరంపల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ పులపాక బాబూరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీటీసీ కొండా సీతారామయ్య, ఎంపీడీవో సత్యకుమార్, సహకార బ్యాంకు అధ్యక్షుడు తుల్లిమిల్లి ఏడుకొండలు, ఎంపీటీసీ–2 నీలిమ పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ సేవలు..

ఉంగుటూరు: పేద ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందజేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ అన్నారు. మానికొండ గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కుల ధ్రువీకరణ పత్రాలు 72, ఆదాయం 66, ఆధార్ మొబైల్ లింక్ అర్జీలు 53 అందజేశారు. సర్పంచ్ ఎన్.స్వర్ణలత, ఎంపీటీసీ ముత్తయ్య, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో శేషగిరిరావు, కార్యదర్శి జి.రత్నకిశోర్, సచివాలయ గ్రామ కన్వీనర్ తోట శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

ఉయ్యూరు: అసమానతలపై అక్షర యుద్ధం చేసి సమానత్వం కోసం పోరాడిన యోధుడు గుర్రం జాషువా అని దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకులు పినమాల నాగకుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో పద్మభూషణ్ గుర్రం జాషువా 52వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగకుమార్ మాట్లాడుతూ గుర్రం జాషువా సమాజం అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రమణి, ఐక్యవేదిక ప్రతినిధులు ఎంజే రవి, కొక్కిలిగడ్డ ప్రదీప్, మట్టా జగన్, మట్టా హనోక్ పాల్గొన్నారు. అనంతరం దళిత ఐక్యవేదిక ప్రతినిధులు ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్‌ను కలిసి మణిపూర్ ఘటనపై వినతి పత్రం అందజేశారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో సోమవారం డ్రెయిన్ల పూడికతీత పనులు నిర్వహించారు. గ్రామంలోని హైస్కూల్ రోడ్డు, బల్లెంవారి వీధి, ప్రధాన గ్రామం, కాల్వగట్టు ప్రాంతాల్లో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ఫలితంగా డ్రెయిన్లలో మురుగు పొంగి రహదారుల పైకి చేరుకుంటున్నాయన్నారు. మురుగునీరు సజావుగా ప్రవహించే నిమిత్తం యంత్ర సహాయంతో పూడికతీత పనులు చేపట్టినట్లు వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణపై సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాతపాడులో పారిశుద్ధ్య పనులు

పాతపాడు(విజయవాడరూరల్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సోమవారం రెండు గ్రామాల్లో ప్రత్యేకంగా డ్రెయినేజీ కాలువల్లో పూడుకుపోయిన వ్యర్థాలను తొలగించి, అక్కడక్కడ రోడ్ల వెంబడి ఉన్న చెట్లు పడిపోయి ప్రజలకు అసౌకర్యంగా ఉన్నందున వాటిని తొలగించే పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు పారిశుద్ధ్య సిబ్బందితో చేయించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి



పోరంకిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, డీవైఎఫ్ఐ నేతలు


పెనమలూరు: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు కారణంగా ప్రజలకు రక్షణలేకుండా ఉందని, మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని ఐద్వా మండల కార్యదర్శి పుసులూరి పాతాళలక్ష్మి డిమాండ్ చేశారు. తాడిగడప మునిసిపాలిటీ పోరంకిలో సోమవారం ఐద్వా, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతాళలక్ష్మి మాట్లాడుతూ మణిపూర్‌లో మైనారిటీలు, గిరిజనులపై అమానుషంగా దాడులు జరుగుతున్నాయన్నారు. సంఘ వ్యతిరేక శక్తులు రెచ్చిపోతున్నా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు ఉప్పాడ త్రిమూర్తి, సీహెచ్ భవాని, ఉప్పాడ ఈశ్వరి, తరిగొప్పల లావణ్య, లక్ష్మీప్రసన్న, వై.సరళ, జోజిమేరీ పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి అయ్యంకి



గన్నవరం రూరల్: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య భావితరాలకు స్ఫూర్తి అని మండలంలోని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. సోమవారం వెంకట రమణయ్య జయంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో గ్రామస్తులు, పాఠకులతో కలసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమ నిర్మాణంలో ఆయన పాత్రను కీర్తించారు. సచివాలయం కార్యదర్శి ఈశ్వర్ పాల్గొన్నారు.

కంకిపాడు సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



కంకిపాడు: కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వాసంశెట్టి శ్రీనివాసరావు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విధుల్లో చేరారు. కంకిపాడు సీఐ పరమేశ్వర్ సస్పెండ్ కావటంతో కొన్ని నెలలుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నియామకం జరగలేదు. గన్నవరం సీఐ కనకారావు ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వహించారు. తాజా నియామకాల్లో సీఐడీ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న వాసంశెట్టి శ్రీనివాసరావును కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. దీంతో ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కంకిపాడు, ఉయ్యూరు టౌన్, రూరల్ పోలీసుస్టేషన్‌ల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని సూచించారు. మెరుగైన పోలీసుసేవలు అందించాలని, ప్రజలతో మమేకం కావాలని స్పష్టం చేశారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం



చిన్నారులు, తల్లులను సత్కరించిన స్టేడియం వాకర్స్‌క్లబ్ సభ్యులు

గుడివాడరూరల్: తల్లిదండ్రులను చిన్నతనం నుంచే గౌరవించడం మన సంప్రదాయమని పలువురు ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక శారదా వికాస్ స్కూల్‌లో సోమవారం తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత చిన్నారులచే తల్లులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించి పూజించాలని కోరారు. క్లబ్ ఫౌండర్ అధ్యక్షుడు లోయిశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఆర్జా ప్రసాద్, మెరుగుమాల శివరామకృష్ణ, ట్రస్ట్ చైర్మన్ లింగం చిట్టిబాబు, సభ్యులు రూప్‌చంద్ జైన్, జ్ఞాన్ చంద్‌జైన్, జుజ్జవరపు వెంకటేశ్వరరావు, కొమరోలు రామకృష్ణ, పొన్నూరు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమగ్ర సర్వే చేయాలి



మాట్లాడుతున్న డెప్యూటీ కలెక్టర్ శ్రీమన్నారాయణరెడ్డి

పెనమలూరు: ఓటరు జాబితాపై బూత్‌లెవల్ అధికారులు సమగ్ర సర్వే చేయాలని పెనమలూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డెప్యూటీ కలెక్టర్ శ్రీమన్నారాయణరెడ్డి అన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో బూత్‌లెవల్ అధికారులకు సోమవారం కానూరులో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలు ఓటర్ల జాబితాలో ఎటువంటి లోపాలు లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లు ఆయా డోర్ నంబర్లలో ఉన్నాయా లేదా పరిశీలించాలన్నారు. ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మరణించిన ఓటర్లను గుర్తించి వారి పేర్లు తొలగించాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి సహకరించి దరఖాస్తు స్వీకరించాలని సూచించారు. ఓటర్ల సర్వేలో బీఎల్ఓలు ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అవినేష్, డెప్యూటీ తహసీల్దార్ భవాని పాల్గొన్నారు.

దాతల సాయంతో విద్యార్థులకు బస్‌పాస్‌లు



బస్‌పాస్‌లు అందజేస్తున్న రవి, వెంకయ్య

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య సంయుక్త ఆర్థిక సౌజన్యంతో బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ మేరకు ఎంపీపీ రవి, వెంకయ్య చేతుల మీదుగా విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద పిల్లల విద్యాభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో తమ వంతుగా మండలంలోని వెయ్యి మంది విద్యార్థుల ఉచిత బస్‌పాస్ జారీకి అయ్యే రూ. 60 చొప్పున ఖర్చును ఆర్టీసీకి చెల్లించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నేత కందిమళ్ల శ్రీనివాసరావు, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ మధు, బస్‌పాస్ ఇన్‌చార్జ్ హనుమంతరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బస్‌పాస్‌లు పంపిణీకి ముందుకువచ్చిన దాతలకు ఆర్టీసీ డీఎం పి. శివాజీ ధన్యవాదాలు తెలియజేశారు.

పిన్నమనేని ఆస్పత్రిలో స్ట్రోక్ యూనిట్



న్యూరో ఐసీయూ ప్రారంభిస్తున్న డాక్టర్ విజయ, పాల్గొన్న సిద్ధార్థ ఆస్పత్రి వైద్యులు

గన్నవరం రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు లక్ష్యంగా పని చేస్తున్న డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల యాజమాన్యం సేవలు అభినందనీయమని ప్రముఖ న్యూరో స్పెషలిస్ట్, లలిత సూపర్‌స్పెషాలిటీస్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ పి.విజయ అన్నారు. సోమవారం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో స్ట్రోక్ యూనిట్ అండ్ న్యూరో ఐసీయూ విభాగాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్షవాతాన్ని ముందుగానే కొన్ని లక్షణాల ద్వారా తెలుసుకోవాలని, స్పృహ కోల్పోవటం, ముఖ కదలికలు మార్పు కలగటం, తలనొప్పి, తల తిరగటం, చూపు మందగించటం, మాట తడబడటం లక్షణాలన్నారు. వీటిని గుర్తించిన నాలుగు గంటల లోపు వైద్యానికి రావటం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, న్యూరాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కె.వంశీకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

మిని డెయిరీల ఏర్పాటుకు రుణ సదుపాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఉత్తమ అమెరికా తెలుగు సంఘం (తానా) ఆర్థిక సహకారంతో మిని డెయిరీల ఏర్పాటు చేసుకునేందుకు పాడిరైతులకు వడ్డీ లేని రుణాలను అందించనున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు. అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయన హనుమాన్‌జంక్షన్‌లోని పాలశీతల కేంద్రంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. తానా మహాసభలకు హాజరు కావటంతో పాటుగా, కృష్ణాజిల్లాకు చెందిన ఎన్ఆర్ఐలతో ప్రత్యేకంగా సమావేశమై పాల ఉత్పత్తి పెరుగుదల, మిని డెయిరీల ఏర్పాటు, పాడిరైతుల సంక్షేమంపై చర్చించినట్లు చలసాని తెలిపారు. పాడి పరిశ్రమ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్ఆర్ఐలు ఆసక్తి చూపినట్లు చెప్పారు. అంతేకాక కృష్ణామిల్క్ యూనియన్ గ్యారెంటీతో పాడిరైతులకు మిని డెయిరీలు ఏర్పాటు చేసుకునేందుకు పాడిరైతులకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు.